సాక్షి సిద్దిపేట

మంగళవారం । 23 । మే । 2023



రెట్టింపు డబ్బులు ఆశచూపి..
సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు మోసపోతూనే ఉన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు డబ్బులు పోగొట్టుకున్నారు. 8లో



రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం
రైస్‌మిల్లులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది సరైన సమయంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. 8లో

సివిల్ ఏఈఈ పరీక్ష ప్రశాంతం
సిద్దిపేటఅర్బన్: పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన సివిల్ ఏఈఈ పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 96 మందికి గాను 72 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండవ సెషన్‌కు 96 మందికి గాను 71 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు.

న్యూస్‌రీల్

బస్సు సర్వీసు ప్రారంభం



కుషాయిగూడకు బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ గీస భిక్షపతి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం నుంచి కుషాయిగూడకు సిద్దిపేట డిపో బస్సు సర్వీసును ఆలయ చైర్మన్ గీస భిక్షపతి జెడ్పీటీసీ సిద్దప్పతో కలసి సోమవారం ప్రారంభించారు. ముందుగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి నుంచి వయా నాగపూరి, తుర్కపల్లి, కీసరగుట్ట మీదుగా కుషాయిగూడకు బస్సు చేరుకుంటుందన్నారు. ఈ బస్సు సర్వీసు కొమురవెల్లికి చేరుకునే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు నీల శేఖర్, సర్పంచ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టరుకు వినతి

కొండపాక/సిద్దిపేటరూరల్: గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని గురుకుల పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చిట్యాల నర్సింలు సోమ వారం అడిషనల్ కలెక్టరు ముజామ్మిల్ ఖాన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో కాంట్రాక్టరు నాసిరకం భోజనం పెడుతున్నారన్నారు. దీంతో విద్యార్థులు తరచూ అస్వస్థకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జాలిగామ నర్సింగరావు, అల్లిగల్ల బాబు, కొండగల్ల నర్సింగరావు,బాల సిద్దయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసం మహిళా సమ్మాన్

పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

చేర్యాల(సిద్దిపేట): మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం పోస్ట్ ఆఫీస్‌లో మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ ఖాతా ప్రవేశపెట్టిందని పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమాదేవి అన్నారు. సోమవారం స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాలో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు రెండేళ్ల కాలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవచ్చన్నారు. ఈ ఖాతాలో 7.5 శాతం వడ్డీ వస్తుందని, వయస్సుతో నిమిత్తం లేకుండా మహిళలందరూ ఈ ఖాతా తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ దిలీప్, భిక్షపతి, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

24న విత్తనమేళా



సిద్దిపేటరూరల్: తొర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన తొర్నాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 'విత్తన మేళ' నిర్వహించనున్నట్లు తొర్నాల పరిశోధనా స్థానం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త శ్రీదేవి సోమవారం తెలిపారు. మేళాలో వరిలో దొడ్డు రకాలు జేజీఎల్-24423 (జగిత్యాల వరి-1), కేఎన్ఎం-118(కునారం సన్నలు), సన్న రకాలు కేఎస్ఎం-1638(కునారం వరి-2), డబ్ల్యుజీఎల్-44(సిద్ది), డబ్ల్యుజీఎల్-962 (వరంగల్ వరి-2), కందిలో రకాలు డబ్ల్యూఆర్‌జీఈ -97 (వరంగల్-1), తృణధాన్య పంట - రాగి, పచ్చిరొట్ట ఎరువు-జనుము, సేంద్రియ ఎరువు-వర్మి కంపోస్ట్ రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతులు-శాస్త్రవేత్తల చర్చలో తమ సందేహాలను నివృత్తి చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆక్వా హబ్‌గా సిద్దిపేట

- తొలిసారి మల్లన్నసాగర్‌లో చేప పిల్లలు వదలనున్న మత్స్యశాఖ
- గత ఏడాది రంగనాయక సాగర్, కొండపోచమ్మలో విడుదల
- రిజర్వాయర్‌లలో చేపలు పట్టుకునేందుకు లైసెన్స్‌ల జారీకి కసరత్తు
- ఈ ఏడాది 4.28కోట్ల చేప పిల్లల విడుదలకు ప్రణాళిక



మల్లన్నసాగర్ రిజర్వాయర్

సాక్షి, సిద్దిపేట : ఆక్వా హబ్‌గా సిద్దిపేట మారనుంది. మంత్రి హరీశ్ రావు చొరవతో కాళేశ్వరం జలాలతో చెరువులు ఎప్పుడు నిండు కుండలాగా, వేసవిలో సైతం మత్తళ్లు దుంకుతున్నాయి. చెరువులు, రిజర్వాయర్‌లలో నిత్యం నీళ్లతో ఉండటంతో గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మొత్తంలో చేప పిల్లలు వదిలేందుకు ప్రణాళికలను రూపొందించారు. జిల్లాలోని 50 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీ కొమురవెల్లి మల్లన్నసాగర్‌లో తొలిసారిగా చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ ప్రణాళికలు రూపొందించారు.

- 4.28 కోట్ల చేప పిల్లలు
- జిల్లాలో 281 మత్స్యకార సొసైటీలున్నాయి. 20,350 మంది సభ్యులు ఉన్నారు. అందులో 38 మహిళా సొసైటీలు 1,850 సభ్యులు, పురుషులు 243 సొసైటీలు 18,500 మంది సభ్యులున్నారు.
- జిల్లా వ్యాప్తంగా 2023-2024 సంవత్సరానికి 1,637 చెరువుల్లో ఉచితంగా 4,28,39,980 చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ ప్రణాళికలను రూపొందించారు. కట్ల, రవ్వలు, బంగారు తీగలు 35 ఎంఎం నుంచి 40 ఎంఎం వరకు చేప పిల్లలు, 1,390 చెరువుల్లో 1,64,61,588 చేప పిల్లలు, 80 నుంచి 100 ఎంఎం చేప పిల్లలు 247 చెరువుల్లో 2,63,78,392 చేపలను వదలనున్నారు.
- మూడు రిజర్వాయర్‌లలో 54.35 లక్షల చేప పిల్లలను వదలనున్నారు. వీటిలో కట్ల, మెరిగే, బంగారు తీగ, రవ్వలు 80ఎంఎం నుంచి 100 ఎంఎం వరకు ఉన్న చేప పిల్లలను వేయనున్నారు.

రిజర్వాయర్	చేప పిల్లల సంఖ్య
మల్లన్నసాగర్	26.80 లక్షలు
కొండపోచమ్మ	14.35 లక్షలు
రంగనాయకసాగర్	13.20 లక్షలు

- ఈ మూడు రిజర్వాయర్‌లలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు, మత్స్యకార సొసైటీలకు ఉపాధి కల్పించేందుకు చేపలు పట్టుకునేందుకు మత్స్యశాఖ లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే రంగనాయకసాగర్‌లో చేపలు పట్టేందుకు లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. అలాగే మల్లన్నసాగర్, కొండపోచమ్మలలో సైతం చేపలు పట్టుకునేందుకు నిర్వాసితులకు లైసెన్స్ జారీ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో నిర్వాసితులు చేపలు పట్టేందుకు లైసెన్స్‌లు జారీ చేయనుండటంతో ఉపాధి లభించనుంది.
- గతేడాది కొండపోచమ్మ, రంగనాయకసాగర్‌లలో చేప పిల్లలు వదిలారు. మత్స్యశాఖ లైసెన్స్‌లు జారీ చేయగానే భూ నిర్వాసితులు, మత్స్యకారులు చేపలు పట్టనున్నారు.

మత్స్య సంపద అభివృద్ధి



కాళేశ్వరం నీటితో చెరువులు ఎప్పుడు జలకళ సంతరించుకుంటుంది. దీనికి తోడు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుండటంతో జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధి చెందుతోంది. మత్స్య కార్మికులకు ఉపాధి లభిస్తోంది. ఈ యేడాది మల్లన్నసాగర్‌లో సైతం చేప పిల్లలను వదిలేందుకు ప్రణాళికలను రూపొందించాం.

– మల్లేశం, జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి

18వేల టన్నుల చేపలు ఉత్పత్తి

2022-23లో జిల్లాలో ఉచితంగా 3,92,44,700 చేప పిల్లలను వదలగా 18,691 టన్నుల చేపలు ఉత్పత్తి అయ్యాయి. వీటి ద్వారా మత్స్యకారులు సుమారుగా రూ.186 కోట్ల ఆదాయం పొందారు. చెరువుల్లో నీటి నిల్వలు ఉంటుండంతో ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను విడుదల చేయడంతో మత్స్యకారులకు ఆదాయం లభిస్తోంది.

దుబ్బాక చేనేత కార్మికులకు మంచి రోజులు

- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాక చేనేత కార్మికులతో కలిసి సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు సందర్శన



వస్త్ర తయారీని పరిశీలిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: నమ్ముకున్న కులవృత్తికి ఆదరణ కరువై అల్లాడుతున్న దుబ్బాక చేనేత కార్మికులకు ఇక మంచి రోజులు రాబోతున్నాయని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఐటీ, చేనేత శాఖ మంత్రి కేటీఆర్ సూచనమేరకు సోమవారం దుబ్బాక నియోజకవర్గ చేనేత కార్మికులు, ప్రజాప్రతినిధులతో కలిసి సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని సారంపల్లి టెక్స్‌టైల్ పార్కును సందర్శించినట్లు చెప్పారు. అక్కడ తయారవుతున్న వస్త్రాలు, చేనేత కార్మికుల స్థితిగతులను పరిశీలించామన్నారు. సిరిసిల్ల తరహాలో దుబ్బాక చేనేత కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించాలనే ఆలోచనతోనే మంత్రి కేటీఆర్ సూచన మేరకు స్టడీ టూర్ చేయడం జరిగిందన్నారు. సిరిసిల్ల తర్వాత అత్యధికంగా చేనేత పరిశ్రమపై ఆధారపడింది దుబ్బాకన్నారు. ఈ ప్రాంతంలో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలోనే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు దుబ్బాకలో పర్యటించి చేనేత పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపడుతారన్నారు. కార్మికులకు అవగాహనకోసమే స్టడీ టూర్ చేపట్టడం జరిగిందన్నారు.

అర్బన్ పార్కులో సందర్శకుల సంఖ్యను పెంచాలి

- కాటేజీలను త్వరగా అందుబాటులోకి తేవాలి
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- గజ్వేల్ అర్బన్ పార్కు సందర్శన



సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

గజ్వేల్: గజ్వేల్ అర్బన్ పార్కులోని కాటేజీల మరమ్మతులను పూర్తి చేసి సందర్శకులకు త్వరలోనే అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. సోమవారం పార్కును సందర్శించి రూర్బన్ మిషన్ పథకం ద్వారా రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన కాటేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాటేజీల నిర్మాణాలకు అదనపు నిధులు మంజూరు చేస్తామని, ఈ నిధులతో ఆధునిక వసతులు కల్పించాలన్నారు. ఆ తర్వాత పార్కులోని వాకింగ్ ట్రాక్, వాచ్ టవర్‌లను పరిశీలించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్లకు పార్కులో అన్ని రకాల వసతులను కల్పించాలన్నారు. పార్కులోకి వచ్చే సందర్శకుల సంఖ్యను పెంచేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగాలన్నారు. రాజీవ్ రహదారిపై పార్కు విశేషాలతో ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, గజ్వేల్ రేంజి అధికారి కిరణ్‌కుమార్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తులో ప్రజావాణి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- సమస్యలను త్వరగా పరిష్కరించాలి
- ప్రజావాణికి 37 దరఖాస్తులు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్

సిద్దిపేటరూరల్: ప్రజావాణి కార్యక్రమంలో పలుమార్లు సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితులు హల్‌చల్‌చేసిన ఘటనలు చోటుచేసుకున్న క్రమంలో సోమవారం త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ బందోబస్తులో ప్రజావాణి కొనసాగింది. ప్రజావాణికి వచ్చిని వారిని పరిశీలించి లోపలికి అనుమతించారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి లో ప్రజల నుంచి డీఆర్‌ఓ లక్ష్మీకిరణ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం 37 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రెహమన్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు రికవరీ చేయాలి

నాది మద్దూరు మండలం, జాలపల్లి సర్పంచ్ వరలక్ష్మి భర్తను. మా గ్రామంలోని సీసీ వైకుంఠం మహిళా సంఘాల సభ్యుల నుంచి నెలవారి డబ్బులు వసూలు చేస్తూ బ్యాంక్‌లో జమ చేయడం లేదు. అధికారులు సీసీ, ఏపీఎంపై చర్యలు తీసుకుని, మహిళా సంఘాల డబ్బులను రికవరీ చేయించాలి.

– జాలపల్లి సర్పంచ్ వరలక్ష్మి భర్త సాగర్

అర్హులకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

మాది గజ్వేల్ పట్టణం. అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెల్లదీస్తున్నాం. డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాం. లబ్ధిదారుల ఎంపిక రెండు సార్లు చేపట్టారు. 1550 మందిని ఎంపిక చేసి 1100 మందికి డ్రా తీశారు. సొంత ఇళ్లు, ఆస్తులు ఉన్న వారికి మాత్రమే కేటాయించారు. అధికారులు మళ్లీ సర్వే చేసి అసలైన అర్హులను ఎంపిక చేసి న్యాయం చేయాలి.

– గజ్వేల్ బాధితులు

మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి

మాది గజ్వేల మండలం సంగాపూర్ గ్రామ మసీద్ కమిటీ సభ్యులం. ఆర్‌అండ్ ఆర్ కాలనీ బంజర్‌పల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ రాములు చెరువు మట్టిని డబుల్ బెడ్రూంల నిర్మాణానికోసమని చెబుతూ విక్రయిస్తున్నాడు. సర్పంచ్‌ను అడిగితే తనకు పర్మిషన్ ఉందన్నాడు. కలెక్టర్, ఎమ్మార్వో కార్యాలయంలో అడిగితే అనుమతి లేదని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మస్జిద్ కమిటీ సభ్యులు, సంగాపూర్

భూ సమస్య పరిష్కరించండి

మాది చేర్యాల గ్రామం. మా తండ్రి పిల్లి యాదగిరి పేరిట 1296 సర్వే నంబర్‌లో ఎన్నో ఏళ్లుగా కబ్జా ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నాం. మా తండ్రి మరణించడంతో ఆ భూమిపై మేము కబ్జాగా ఉన్నాము. గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా ఆ భూమిని వారి భూమి అంటూ కేసు వేశారు. ఆ భూమి పిల్లి యాదయ్యకు చెందినదిగా ధ్రువీకరించి పత్రం అందించారు. 2017లో అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కేసు పెట్టిన వారు అప్పీలు చేయడంతో రికార్డు జిల్లా అధికారి వద్దకు చేరింది. ఆ అధికారి మా వాదనలు వినకుండా మాకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి.

– పిల్లి ప్రభుదాస్

గొప్ప సామాజికవేత్త భాగ్యరెడ్డి వర్మ

సిద్దిపేటరూరల్: దళిత జాతి అభ్యున్నతికి జీవితాంతం పోరాడిన గొప్ప సామాజికవేత్త భాగ్యరెడ్డి వర్మ అని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి సందర్భంగా ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలితరం సామాజిక ఉద్యమకారుడు, హైదరాబాదులో అంటరానితనం నిర్మూలనకు అనేక సామాజిక ఉద్యమాలను నిర్వహించిన ఉద్యమకారుడు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు.



నివాళులర్పిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలి

- అకాల వర్షాలతో రైతులు నష్టపోవద్దు
- పక్క జిల్లాల్లో కొనుగోలు పూర్తిచేశారు
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



రాంపురంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

తొగుట(దుబ్బాక): ధాన్యం కొనుగోలు ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తిచేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని రాంపురం, తొగుట, తుక్కాపూర్ గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. రైతులు, అధికారులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు, ఎంత వస్తుందని ఆరా తీశారు. మండలంలో వరి కోతలు తుది దశకు చేరాయని అధికారులు వివరించారు. లారీలు, గన్నీ బ్యాగుల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటాని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్‌ల్లో ఎంట్రీ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు రెండు రోజుల్లో పూర్తిచేయాలన్నారు. అధికారులు స్థానికంగా ఉండాలని ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తోందని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుడా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు వరి సాగు విధానాన్ని మార్చుకోవాలన్నారు. ప్రకృతి వపత్తు బారినపడకుండా ముందుగా వరి నాట్లు వేసుకుంటే సమస్యలు రావన్నారు. పక్క జిల్లాల్లో ధాన్యం కొనుగోలు పూర్తికావడంతో కేంద్రాలను ఎత్తివేశారని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా అధికారి హరీశ్, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, పీఏసీఎస్ సీఈవో గంగారెడ్డి, ఐకేపీ ఏపీఎం మగ్దూం అలి, ఏఈవోలు నవీన్ కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

రైతన్న కన్నీరు..



దుబ్బాకటౌన్: ఈ ఫొటోలో భారీ వర్షంతో వరదలో కొట్టుకపోయిన వడ్లను చూపిస్తు కన్నీరు పెడుతున్నది దుబ్బాక పట్టణానికి చెందిన రైతు ఎంగారి చిన్న గోపాల్. తన పొలంతో పాటు కౌలుకు తీసుకొని 20 ఎకరాల్లో వరి కోసి పది రోజుల క్రితం వడ్లు ఆరబోశాడు. సోమవారం తెల్లవారు జామున 3 గంటల సయంలో కురిసిన భారీ వర్షానికి వడ్లు తడిసిముద్దవడమే కాకుండా చాలా వరకు కొట్టుకపోయాయి. అర్ధరాత్రి కావడంతో వడ్లు ఆరబోసిన ప్రాంతానికి రాలేకపోయాడు. తెల్లారి వచ్చిచూసేసరికి వరదలో కొట్టుకుపోయి కనిపించడంతో గుండెలవిసేలా రోదిస్తుచ కొట్టుకు దాన్యాన్ని ఏడుస్తునే ఎత్తడం కనిపించింది. వడ్లన్నీ కొట్టుక పాయే, ఏం చేయ్యాలే ఎట్లా అంటూ రైతు గోపాల్‌తో పాటు మార్కెట్ యార్డులో చాల మంది రైతులు కన్నీరు పెట్టడం కనిపించింది. వర్షంతో చాలా నష్టపోయామని, ఉన్న వడ్లను త్వరగా కొని తమకు న్యాయం చెయ్యాలని రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు.



దుబ్బాక మార్కెట్‌లో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతులు

- అకాల వర్షంతో ఆగమాగం
- జిల్లా వ్యాప్తంగా దంచికొట్టిన వాన
- తడిసి ముద్దయిన ధాన్యం
- వరదల్లో కొట్టుకపోయిన వడ్లు


రెక్కలు ముక్కలు జేసుకొని..

- ఆరుగాలం రెక్కలు ముక్కలు జేసుకొని పంట పండిచి తీరా అమ్ముకునేందుకు వచ్చిన రైతులను అర్ధరాత్రి కురిసిన వర్షం ఆగం జేసింది. ఆదివారం అర్ధరాత్రి 01.30 నుంచి 3.30 గంటల వరకు వాన దంచికొట్టడంతో వేల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయింది.
- దుబ్బాక మార్కెట్ యార్డుతో పాటు, దుబ్బాక, సిద్దిపేట, తొగుట, నంగనూర్, హుస్నాబాద్, బెజ్జంకి, చిన్నకోడూర్, మిరుదొడ్డి మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసింది.
- ధాన్యం బస్తాలు కూడా తడిసిపోవడంతో పరిస్థితి చాల దయనీయంగా తయారైంది. కొనుగోలు కేంద్రాల్లో, రోడ్లపైన పోసి ఉంచిన ధాన్యం వరదలో కొట్టుకపోయింది.
- దాన్యాన్ని కాపాడుకునేందుకు అర్ధరాత్రి రైతులు పడరాని పాట్లు పడ్డా ఫలితం లేకుండా పోయింది.

ఎట్లా గట్టున పడేది

- భారీ వర్షంతో ధాన్యంను తడిసిపోవడంతో రైతులు ఏం చేయాలో తోచక పరేషాన్ అవుతున్నారు. వర్షానికి తడిసిన, వరదలో కొట్టుక పోయిన ధాన్యాన్ని చూస్తూ రైతులు కన్నీరు పెట్టడటం తప్పా ఏం చేయలేని స్థితిలో తల్లడిల్లుతున్నారు.
- తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుందామంటే స్థలం లేకపోవడంతో మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలంటు రైతులు వేడుకుంటున్నారు.

ఎండిన వడ్లు తడిసి ముద్దయినయ్



మంచిగ ఎండిన వడ్లు వానకు మొత్తం తడిసిపోయి, వరదలో చాలా వరకు కొట్టుకపోయాయి. వాన భయానికి కొంత కుప్ప జేసి పెట్టినా వరద నీరు కిందకు వచ్చి తడిసిపోయింది. కవరు కప్పినా లాభం లేదు. వరదలో చాలా వడ్లు కొట్టుకపోయినయి, ఏం చేయాలో తోస్తలేదు. గిట్లనే ఉంటే మొలకలు వచ్చేటట్లు ఉన్నయి. ఏం జెయ్యాలే ఆరుగాలం కష్టపడ్డ లాభం లేకుండా పోయింది. వానకు అందరి వడ్లు తడిసిపోయినయి. ఎండబోసేందుకు జాగాలు లేవు. ఎట్లనో ఏమో. సర్కారోల్లు రైతుల బాధలు పట్టించుకొని వడ్లు కొనాలే, లేకుంటే రైతుల బ్రతుకులు ఆగం అవుతయి.

– గోపాల్‌రెడ్డి, రైతు దుబ్బాక

క్రీడలకు అధిక ప్రాధాన్యత



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్, అడిషనల్ కలెక్టర్

- జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ అన్నారు. అడిషనల్ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలసి సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలాల వారిగా క్రీడాకారులచేత మార్చ్‌ఫాస్ట్ చేయించి, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్రంలో అనేక క్రీడా సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, స్త్రీ, పురుషుల విభాగంలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమేశ్, సిద్దిపేట రూరల్ ఎంపీపీ శ్రీదేవి రాంచందర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామేశ్వర్‌రెడ్డి, క్రీడా సంఘాల బాధ్యులు రవీందర్‌రెడ్డి, దామెర మల్లేశం, అశోక్, సతీశ్, వెంకటస్వామి, గన్నె భరత్‌రెడ్డి, అక్బర్, హరికిషన్, కాటం శ్రీనివాస్, సుజాత, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్టాండ్‌లో మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఈ, ఏఈలు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో మరమ్మతు పనులను ఆశాఖ డిప్యూటీ ఈఈ మనోహర్‌రావు, ఏఈ అనుపమరెడ్డి, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు సోమవారం పరిశీలించారు. రూ.6లక్షల వ్యయంతో ఆయా మరమ్మతు పనులను అధికారుల పర్యవేక్షణలో జోరుగా నిర్వహిస్తున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ కావడంతో పెయింటింగ్‌తోపాటు చిన్నచిన్న పనులను శరవేగంగా చేపడుతున్నారు. ఆయా పనులను అధికారులు పరిశీలించారు.

బ్రేకు ఫెయిల్.. చెట్టును ఢీకొన్న ఆటో



ప్రమాదానికి గురైన ఆటో

చేగుంట(తూప్రాన్): బ్రేకు ఫెయిల్ కావవడంతో ఓ ఆటో చెట్టును ఢీకొని ఎనిమిది మందికి గాయాలైన సంఘటన మండలంలోని బోనాల్ శివారులో రామాయంపేట రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన యాదయ్య కూతురి వివాహానికి రామాయంపేటలో కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు ఆటోలో బయలుదేరారు. ఆటో బోనాల్ శివారులోకి రాగానే బ్రేకులు పడకపోవడంతో ఆటో చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదయ్య, నరేశ్, పద్మ, కల్పనతో పాటు బంధువులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వివరాలను దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

కొండపాక(గజ్వేల్): పోగొట్టుకున్న బ్యాగును కుకునూరుపల్లి పోలీసులు గంటలోపు వెతికి బాధితులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి..హైదరాబాద్ నుంచి సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్‌లో అత్తారింటికి ద్విచక్ర వాహనంపై సోమవారం భార్యభర్తలు దండె వర్ష, వెంకటేశ్‌లు వెళ్తున్నారు. ఈ క్రమంలో తిమ్మారెడ్డిపల్లి శివారులో కొమురవెల్లి కమాన్ సమీపంలో హ్యాండ్ బ్యాగు జారి ముళ్ల పొదలో పడింది. వారికీ ఎంత వెతికినా బ్యాగు దొరకలేదు. వెంటనే ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఎస్ఐ రాములు బ్యాగు పడిపోయిన లోకేషన్‌ను బ్లూ కోర్ట్సు డ్యూటీ చేస్తున్న మహేశ్, స్వామిలకు చేరవేశాడు. లోకేషన్ ఆధారంగా లైట్ వెలుతురులో వెతికారు. రోడ్డు ప్రక్కన ముళ్ల పొదల్లో దొరికిన బ్యాగును తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. భార్యభర్తలు పేర్కొన్నట్లుగా బ్యాగులో రెండు సెల్ ఫోన్లు, రూ.5వేలు ఉండటంతో నిర్ధారించుకున్న పోలీసులు బాధితులకు అప్పగించారు. పోలీసుల పనితీరుపై భార్యభర్తలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో మద్యంసేవించి పట్టు బడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో 18 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి 16 మందికి రూ.2 వేల చొప్పున, మరో ఇద్దరికి రూ.3 వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

రెట్టింపు డబ్బులు ఆశచూపి.. సైబర్ మోసం

రెట్టింపుడబ్బులు వస్తాయని ఆశతో సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో ఒకరు, హుస్నాబాద్ పరిధిలో బైక్ కొనుగోలు చేయబోయి మరొకరు, గజ్వేల్‌లో 2బిహెచ్‌కే ఫ్లాట్ కోసం ఇంకొకరు ఆన్‌లైన్లో గుర్తు తెలియని వ్యక్తి చెప్పినట్టుగా వివరాలు నమోదు చేసి డబ్బులు పోగొట్టుకున్నారు.



సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్‌లో పెట్టుబడిగా పెడితే రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆశ చూపిఓ వ్యక్తి సైబర్ మోసానికి గురైన సంఘటన సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి టెలిగ్రామ్ చాటింగ్ ద్వారా యూఎస్‌ఏ టాస్క్ గురించి తెలుసుకున్నాడు. ఆన్‌లైన్‌లో తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడిగా పెడితే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశపడి రూ.80,000 పెట్టుబడిగా పెట్టాడు. అనంతరం సదరు గుర్తు తెలియని వ్యక్తి నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో బాధితుడు మోసపోయినట్టుగా గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి బైక్ కొనుగోలు చేయడానికి ఫేస్‌బుక్‌లో ఒక యాడ్ చూశాడు. అందులో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేయగా గుర్తు తెలియని వ్యక్తి బైక్ ఫొటోలను తన సెల్‌ఫోన్‌కు పంపించి ధర వివరాలను తెలిపాడు. ముందుగా చార్జీల నిమిత్తం కొంత మొత్తం డబ్బులు పంపించాలని కోరడంతో ఆ మాటలు నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.37,250 పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో బాధితుడు మోసపోయినట్టుగా భావించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

గజ్వేల్..

గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి హైదరాబాద్‌లో 2బిహెచ్‌కే ఫ్లాట్ కావాలని 99ఎకరాల యాప్ నుంచి సంప్రదింపులు జరిపాడు. గుర్తు తెలియని వ్యక్తి మాట్లాడి ఫ్లాట్ బుక్ చేసుకోవాలంటే తన ఆధార్ కార్డు, ఇతర వివరాలు పంపాలని చెప్పాడు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి చెప్పినట్టుగా బాధితుడు చేశాడు. ఈ క్రమంలోనే మొదట రూ.30వేలు పంపించాలని చెప్పాడు.

ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.30వేలు పంపించాడు. వెంటనే సదరు గుర్తుతెలియని వ్యక్తికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో చేసేదేమి లేక బాధితుడు మోసపోయినట్టుగా గుర్తించాడు. ఈ ఘటనపై జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

యువకుడి హత్యకేసులో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన సీఐ భూపతి



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

కోహీర్: కోహీర్ మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామ శివారులో జరిగిన శ్రీకాంత్ అలియాస్ చిన్న(25) హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ భూపతి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కోహీర్ మండలంలోని మాచిరెడ్డిపల్లికి చెందిన ఎం.డి ఇసాముద్దీన్(35), జహీరాబాద్ పట్టణానికి చెందిన ఎం.డి ఆమేర్(29)లకు నాలుగు సంవత్సరాలుగా శ్రీకాంత్‌తో పరిచయం ఉంది. నిందితులు జహీరాబాద్ పట్టణంలోని మోహన్ థియేటర్ ప్రాంతంలో పండ్ల వ్యాపారం చేస్తున్నారు. మృతుడు మద్యం కోసం నిందితులకు తరచూ డబ్బుల కోసం వేధించేవాడని, డబ్బులు ఇవ్వక పోతే బూతులు తిడుతూ పండ్ల వ్యాపారం చేయొద్దని బెదిరించే వాడన్నారు. దీంతో ఈ విషయంపై వారు కక్ష పెంచుకొని పథకం ప్రకారం దావత్ చేసుకుందామని పిలిపించుకున్నారు. ఈ నెల 20వ తేదీన మాచిరెడ్డిపల్లి గ్రామ శివారులోకి రాత్రి 10 గంటల ప్రాంతంలో తీసుకెళ్లారు. నిర్మానుష్య ప్రదేశంలో మద్యం తాగించారు. రాత్రి 2గంటల ప్రాంతంలో శ్రీకాంత్ తలపై బండ రాయితో మోది, ముఖంపై, శరీరంపై బీరు బాటిళ్లతో పొడిచి హత్య చేసినట్లు నిందితులు తమ విచారణలో ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి అక్క లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక సెల్ ఫోన్, రెండు బైకులను సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య

కాలేజీకి వెళ్లిన విద్యార్థి రైలు కిందపడి, కుటుంబ కలహాలతో ఓ మహిళ కుంటలో దూకింది. అదనపు కట్నం వేధింపులు భరించలేక ఉరేసుకొని ఇంకొక మహిళ మృతి చెందింది.



గీత (ఫైల్)

ములుగు(గజ్వేల్): అదనపు కట్నం వేధింపులు భరించలేక వివాహిత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ములుగు మండలం బండనర్సంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ములుగు ఎస్ఐ రంగకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..మేడ్చెల్-మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేటకు చెందిన గీత(36)కు సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండనర్సంపల్లి గ్రామానికి చెందిన కుంటోని దేవేందర్‌తో 19 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహ అనంతరం సంవత్సర కాలం వారిరువురి మధ్య సంసారం సాఫీగా సాగింది. వారికి కూతురు వైష్ణవి, కుమారుడు భానుప్రసాద్ ఇద్దరు సంతానం. కొంత కాలం గడిచిన తర్వాత దేవేందర్ మద్యానికి బానిసై భార్య గీతను అదనపు కట్నం తేవాలని శారీరకంగా, మానసికంగా వేధించడం మొదలు పెట్టాడు. భర్త వేధింపులు భరించ లేక రెండు సార్లు అదనపు కట్నం తీసుకొచ్చింది. అయినప్పటికీ దేవేందర్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. చేసేదేమిలేక భర్త వేధింపులు భరించలేక గీత జీవితంపై విరక్తితో ఆదివారం రాత్రి తన వ్యవసాయ పొలం పక్కన వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కుంటలో దూకి మహిళ..

గజ్వేల్‌రూరల్: మద్యం తాగిన మైకంలో కుటుంబ సభ్యులతో గొడవపడి కుంటలో దూకి ఓ మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం వెలుగుచూసింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లికి చెందిన తూర్పాటి అంజలి(41) పాత సీసాలు, ఇనుప సామాన్లను ఏరుకొని వాటిని విక్రయిస్తూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తుంది. మద్యం తాగే అలవాటున్న అంజలి కుటుంబ సభ్యులతో గొడపడి తాను చనిపోతానంటూ పేర్కొనేదని, ఈ క్రమంలో ఆదివారం రాత్రి సైతం రోజు మాదిరిగానే మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడి బయటకు వెళ్లిపోయింది. అనుమానం వచ్చిన కుటుంబీకులు వెంటనే గ్రామ శివారులో ఉన్న చింతల కుంటలో గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. తిరిగి సోమవారం ఉదయం కుంట వద్ద చూడగా మృతదేహం తేలడంతో పోలీసులకు వారు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి..



నరేశ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): చల్మెడ గ్రామానికి చెందిన మంగిలిపల్లి నరేశ్ (20)డిగ్రీ విద్యార్థి అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేటలోని డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న నరేశ్ తన స్నేహితులతో కలిసి సోమవారం కళాశాలకు వెళ్లి మధ్యలోనే లేచి వెళ్లిపోయాడు. క్లాసులు ముగిసిన అనంతరం అతని స్నేహితులు నరేశ్‌కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. మానసిక ఆందోళనలో ఉన్న అతను అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని వద్ద కాలేజీ ఐడీ కార్డు లభ్యమవడంతో ఎస్ఐ ఈ విషయమై మృతుని తండ్రికి సమాచారం అందజేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విద్యుత్ ఘాతంతో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..సోమవారం మధ్యాహ్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనంలో విద్యుదాఘాతంతో ట్రాఫిక్ మెటీరియల్ తెచ్చిన అట్టపెట్టె(బాక్స్) అంటుకుంది. దీంతో గదినిండా పొగ వ్యాపించింది. వెంటనే ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి స్పందించి, అందరినీ అప్రమత్తం చేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది లోపలికి వెళ్లి అంటుకున్న అట్ట పెట్టెను బయటికి తీసుకొచ్చారు. అనంతరం భవనానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

భూ బాధితుడి ముందస్తు అరెస్ట్

కొండపాక(గజ్వేల్): భూ బాధితుడు పిల్లి అశ్వద్ధామను ముందస్తుగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. త్రీటౌన్ సీఐ భాను ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దుద్దెడ శివారులో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ సముదాయంలో దుద్దెడ, రాంపల్లి గ్రామ శివారులో 663, 143 సర్వే నంబర్లలో కొంత మంది బాధితులు భూములు కోల్పోయారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సరైన పరిహారం రాలేదని, బాధిత కుటుంబానికి 200 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వం ఇస్తుందని చెప్పి మాట తప్పిందని బాధితులు ఆరోపిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో బాధితుడు పిల్లి అశ్వద్ధామ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో మళ్లీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఆత్మహత్యా యత్నానికి పాల్పడకుండా ఉండేందుకు ముందస్తుగా అతణ్ని అదుపులోకి తీసుకున్నట్లు త్రీటౌన్ సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సిద్దిపేటఅర్బన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన సంఘటన పొన్నాల శివారు రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద జరిగింది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..మిట్టపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ యాసిన్ (38) తల్లిదండ్రులు లేకపోవడంతో మేన బావ అయిన సాయబ్ హుసేన్ వద్ద సిద్దిపేటలో ఉంటున్నాడు. మృతునికి అనారోగ్య సమస్యలకు తోడు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో పొన్నాల రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలో రాజీవ్ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం

సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): రైస్‌మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదంలో ఫైర్‌సిబ్బంది సరైన సమయంలో స్పందించి మంటలను అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన సోమవారం రాంపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామంలోని విజయలక్ష్మి రైస్ మిల్లు గోదాములో మధ్యాహ్నం ఒక్క సారిగా మంటలు చెలరేగి గన్ని సంచులకు అంటుకున్నాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపిస్తుండడంతో సంచులు దగ్ధం కాగా అక్కడ దట్టమైన పొగ వ్యాపించింది. దీన్ని గమనించినా హమాలీలు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఎంత ప్రయత్నించినా మంటలను వారు అదుపు చేయలేకపోయారు. వెంటనే అక్కడున్న వారు స్పందించి ఫైర్ సిబ్బందికి సమాచారం చేరవేశారు. వారు అక్కడికి చేరుకొని అర్ధగంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. పక్కనే నిల్వ చేసిన బియ్యం బస్తాలు ఉండగా సకాలంలో మంటలు ఆర్పడంతోనే తక్కువ నష్టం వాటిల్లిందని రైస్‌మిల్లు నిర్వాహకులు తెలిపారు.

బయటకు వెళ్లివస్తానని వెళ్లిన వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బయటకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఘణపూర్ గ్రామానికి చెందిన రాములు కూలీ పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 17వ తేదీన మధ్యాహ్నం బయటకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన రాములు తిరిగి రాలేదు. అతనికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. దీంతో కుమారుడి అదృశ్యంపై సోమవారం తండ్రి వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న పౌరసరఫరాల గోదాం ఇన్‌చార్జి

రామాయంపేట(మెదక్): రామాయంపేట పౌరసరఫరాల గోదాం ఇన్‌చార్జి సతీశ్ బెదిరింపులకు పాల్పడుతూ తన షాపుకు రేషన్ బియ్యం సరఫరా చేయడంలేదని స్థానిక రేషన్ డీలర్ శ్రీనివాస్ ఆరోపించాడు. తాను పట్టణంలో రెండో నెంబర్ రేషన్ దుకాణాన్ని నిర్వహిస్తుండగా, ఇటీవల అధికారులు మరో రేషన్ దుకాణం (నాలుగో నెంబర్) అదనపు బాధ్యతలు అప్పగించారని ఆయన పేర్కొన్నారు. మరో డీలర్‌తో కుమ్మక్కయిన గోదాం ఇన్‌చార్జి సతీశ్ సదరు బీసీ కాలనీ రేషన్ దుకాణాన్ని మరో డీలర్‌కు అప్పగిస్తేనే రేషన్ దుకాణానికి బియ్యం సరఫరా చేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆయన వాపోయారు. నెలదాటుతున్నా ఇంతవరకు బియ్యం సరఫరా చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయమై జిల్లా సవిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా సదరు డీలర్ తన దృష్టికి తీసుకొచ్చాడన్నారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ మన్నాన్‌ను సంప్రదించగా తాను పలుమార్లు సతీశ్‌కు చెప్పినా పట్టించుకోలేదన్నారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పంటించిన యువకుడు అరెస్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్‌లోని బొంబాయి కాలనీలో గత రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనాలకు నిప్పంటించిన యువకుడిని రామచంద్రాపురం పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలో నివాసం ఉండే చందు స్థానికంగా బ్యాండ్ బృందంలో పనిచేస్తున్నాడు. కాగా చందుకు ద్విచక్ర వాహనాలపై దూర ప్రాంతాలకు తిరిగే అలవాటు ఉంది. ఈ విషయంలో వెంకటరమణను బైక్ అడిగాడు. బైక్‌లపై తిరిగే విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. దాంతో మద్యం మత్తులో ఉన్న చందు వెంకటరమణ వాహనంపై, అతనిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దాంతో పక్కనే ఉన్న వాహనాలకు సైతం నిప్పుఅంటుకున్నాయి. విచారణ చేపట్టిన పోలీసులు చందును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఈదురు గాలులకు పౌల్ట్రీ ఫాం ధ్వంసం



దామరంచలో కూలిపోయిన పౌల్ట్రీ ఫాం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొనుగోలు కేంద్రం, పంటచేనుల వద్ద వరిధాన్యం కుప్పలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. దామరంచ గ్రామంలో ఈదురు గాలుల వల్ల ఓ వృక్షం విరిగింది. గ్రామానికి చెందిన భగవాన్‌రెడ్డి పౌల్ట్రీ ఫాంపై పడడంతో షెడ్ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో సుమారు రూ.15లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

వేర్వేరు ఘటనల్లో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు.



కమలేశ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న సెంట్రింగ్ కార్మికుడు మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ అక్బర్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం..బీహార్‌కు చెందిన కమలేశ్(32) బతుకుదెరువు కోసం ఆరు నెలల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వచ్చాడు. ఇక్కడ సెంట్రింగ్ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని శివాజీ నగర్ కాలనీలో నర్సింలు ఇంటికి ఆదివారం రెండో అంతస్తులో కిటికికి సెంట్రింగ్ కొడుతుండగా ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. దీన్ని గమనించిన ఇంటి యజమాని, స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం కమలేశ్ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గాంధీ ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య, పిల్లలు స్వగ్రామంలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటరూరల్‌లో చికిత్స పొందుతూ..



రాజు (ఫైల్)

సిద్దిపేటరూరల్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం రాఘవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన బైతిరాజు(23) గత బుధవారం ఇర్కోడ్ గ్రామంలోని పెళ్లికి వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో రాంపూర్ గ్రామ శివారు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతణ్ని మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరంతో యువకుడు..



ఇసాక్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: జ్వరంతో సోదరుడు మృతి చెందాడని అన్న ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..అస్సాంకు చెందిన ఇసాక్(24), అన్న మంగళ్‌తో కలిసి బతుకుదెరువు కోసం ఇస్నాపూర్‌కు వచ్చారు. ఇక్కడ పాశమైలారం పారిశ్రామికవాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇసాక్‌కు ఆదివారం రాత్రి జ్వరం రావడంతో రూమ్‌లో మాత్ర వేసుకొని పడుకున్నాడు. సోమవారం మంగళ్ నిద్ర లేచాడు. సోదరుడు ఇసాక్‌ను ఎంత లేపిన లేవకపోవడంతో శ్వాస పరిశీలించాడు. దీంతో శ్వాస ఆడడంలేదని గ్రహించి సోదరుడు మృతిచెందిన్నట్లు అన్న గుర్తించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నగదు, 28తులాల వెండి, 4గ్రాముల బంగారు కమ్మలు అపహరణ


చిన్నశంకరంపేట(మెదక్): తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. చిన్నశంకరంపేట ఇన్‌చార్జి ఎస్ఐ పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం..చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన ఏమ నాగమణి ఇంటికి తాళం వేసి తన కూతురు వద్దకు వెళ్లింది. ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోచొరబడిన దుండగులు బీరువాలోని రూ.27,500లు, 28 తులాల వెండి పట్టగొలుసులు, 4 గ్రాముల బంగారు కమ్మలు అపహరించారు. సోమవారం ఈ విషయం గమనించిన అత్త లక్ష్మమ్మ కోడలికి సమాచారం అందజేసింది. ఆమె వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నీట మునిగి ముగ్గురి మృతి

చేగుంటలోని వడియారం గ్రామానికి చెందిన ఇద్దరు చేపల వేటకు వెళ్లి నీట మునిగారు. దుబ్బాకలో దశదిన కర్మకని వెళ్లి చెరువులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.



మల్లేశం (ఫైల్)



యాదగిరి (ఫైల్)

చేగుంట(తూప్రాన్): చేపల వేటకు వెళ్లి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన చేగుంట మామిడికుంటలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..వడియారం గ్రామానికి చెందిన గేటు మల్లేశం(35), బొక్క యాదగిరి(28)లు చేగుంట శివారులోని మామిడికుంటలో చేపలు పట్టడానికి ఆదివారం వెళ్లారు. సోమవారం ఉదయం వరకు వీరు ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసినా వారు స్పందించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఈ క్రమంలో వారు చేగుంట మామిడికుంట శివారులో మృతుల బట్టలు చెప్పులను చూసి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గజఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటకు తీయించారు. మామిడి కుంటలో జేసీబీ గుంతల లోతును గుర్తించక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెంది ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మల్లేశంకు ముగ్గురు కూతుర్లు, యాదగిరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాలను పోషించే పెద్దదిక్కును కోల్పోయినట్లు బాధిత కుటుంబీకులు రోదిరచడం చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..



కృష్ణ మృతదేహం

దుబ్బాక: దశదిన కర్మకని వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు యువకుడు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో జరిగింది. రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాళ్ల కృష్ణ(30) వ్యవసాయ కూలీగా పని చేసుకుంటు జీవనం సాగించేవాడు. గ్రామంలో బంధువులు చనిపోవడంతో సోమవారం దశదిన కర్మ సందర్భంగా పెద్ద చెరువులో స్నానం చేయడానికి వెళ్లాడు. స్నానం చేస్తున్న క్రమంలో ఆయన ప్రమాదవశాత్తు జేసీబీ గుంతలో పడి నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు గాలించి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.